ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 215 | పేజీలు: 5 | వెల: రూ.3/- | గురువారం 12 నవంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

వచ్చే విద్యా సంవత్సరం నుంచే

తెలంగాణలో 10+2 విధానం

అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు... నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం

12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ... ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా మౌలిక వసతులు



హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

రాష్ట్ర విద్యా వ్యవస్థలో భారీ మార్పులకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పాఠశాల విద్యలో 10ం2 విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంస్కరణల అమలులో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి విద్యార్థులకు ప్రత్యేక విద్య అందించాలని సూచించారు. విద్యార్థులకు 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ (స్కిల్లింగ్) అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు.

విద్య, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక ప్రాధాన్యం

వైట్‌కాలర్ జాబ్స్‌కు ఏఐ ముప్పు.. బ్లూకాలర్‌కు ఢోకా లేదు: సీఎం రేవంత్

ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని వెల్లడి

విద్య, నీటిపారుదలకు నెహ్రూ బలమైన పునాదులు వేశారని వ్యాఖ్య

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి వల్లే భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో ఉన్నారని వెల్లడి

మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ

2లో..





‘ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు?’

రైతు భరోసా బకాయిలు, రుణమాఫీ పూర్తి చేయాలి..

కూలీలకు రూ.36 వేల సాయం అందించాలి

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు!

నిర్మల్ రైతు గర్జన సభలో కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ నిప్పులు

నిర్మల్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. “ఇది దేవుడిచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు. ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకుల వికృతి తెచ్చిన కరువు” అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ‘రైతు గర్జన’ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల సంక్షేమం కంటే రాజకీయాలే ముఖ్యమయ్యాయని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతును రాజులా చూసుకున్నామని, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధు అందించామని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలైన్లలో చెప్పులు, పాస్‌పుస్తకాలు పెట్టుకుని ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రైతు ఫోన్ చేస్తే ఎరువుల బస్తాలు పొలాల వద్దకే చేరేవని, ఇప్పుడు యాప్‌ల పేరుతో సర్వర్లు పనిచేయక రైతులకు అరకొరగా యూరియా ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుబంధు, రైతుభరోసా చెల్లింపుల్లో జాప్యం చేస్తూ రైతులను అప్పులపాలు చేస్తున్నారని ఆరోపించారు. నిర్మల్‌లో గులాబీ దళం కదం తొక్కి రైతు గర్జన సభ విజయవంతం కావడం చూస్తుంటే కాంగ్రెస్ వణకడం ఖాయమని అన్నారు.

తెలంగాణ బస్ స్టేషన్లలో ఫ్రీ వైఫై!

ఒక్కో బస్ స్టేషన్‌కు ప్రత్యేక కంట్రోలర్ నియామకం

హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)



తెలంగాణలోని బస్ స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేం దుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 5 వేల మందికిపైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 బస్ స్టేషన్లను గుర్తించింది. వీటిలో దశలవారీగా ఉచిత వైఫై సదుపాయం అందుబాటులోకి తీసుకురానుంది.గుర్తించిన బస్ స్టేషన్లలో ఇప్పటికే ఒక్కో కంట్రోలర్‌ను నియమించింది. ప్రయాణికులు బస్సుల వివరాలు, రాకపోకల సమయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను ఏర్పాటు చేసింది. కొత్త టైమ్ టేబుల్ బోర్డులను కూడా అందుబాటులోకి తీసుకురానుంది.ప్రయాణికుల భద్రతతో పాటు బస్ స్టేషన్లలో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. వీటిని సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయానికి అనుసంధానించనున్నారు.

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి



కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క

సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం

పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని విద్యానగర్‌లో నూతన ‘తెలంగాణ పబ్లిక్ స్కూల్’ భవన నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్’, ‘తెలంగాణ పబ్లిక్ స్కూల్స్’ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు.

సర్వాంగ సుందరంగా పునరుద్ధరించిన తమ్మిడికుంట

నాగార్జున నిజ జీవితంలోనూ హీరో లాంటి నిర్ణయం తీసుకున్నారు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

సినిమాల్లోనే కాదు.. నాగార్జున నిజ జీవితంలోనూ హీరో లాంటి నిర్ణయం తీసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్ మాదాపూర్‌లో సర్వాంగ సుందరంగా పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును అక్కినేని నాగార్జున తో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. “శిల్పులు చెక్కని శిల్పాలు ఎన్నో మన హైదరాబాద్ చుట్టూ ఉన్నాయి. ఓఆర్ఆర్ లోపల 1372 చెరువుల్లో 50శాతం కనుమరుగయ్యాయి. ప్రభుత్వ నిర్ణయాలు కొందరికి కష్టం, నష్టం కలిగించి ఉండొచ్చు. మంచి నిర్ణయం తీసుకుంటే కొందరికి నష్టం జరిగినా కొన్ని తరాలకు మేలు జరుగుతుంది. తమ్మిడికుంటను 14 ఎకరాల నుంచి 30 ఎకరాలకు విస్తరించాం. చెరువు అభివృద్ధి కోసం నాగార్జున రెండెకరాలు ఉదారంగా ఇచ్చారు. నీళ్ల ఆవాసాన్ని మనం ..మిగతా 2లో



తెలంగాణలోనే తొలి స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌కు గుర్తింపు

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో గ్రేటర్ హైదరాబాద్‌కు దక్కిన స్వచ్ఛ సిటీ పురస్కారం

ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ కింద కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ‘స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26’ సర్వేలో తెలంగాణ రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌కు అరుదైన జాతీయ గుర్తింపు దక్కింది. రాష్ట్రంలోనే మొట్టమొదటి ‘స్వచ్ఛ నగరం’ (స్వచ్ఛ సిటీ)గా హైదరాబాద్ అవార్డును కైవసం చేసుకుంది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో హైదరాబాద్ అత్యుత్తమ పనితీరు కనబరిచి ఈ ఘనత సాధించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం (నవంబర్ 11) ఘనంగా జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్ నగర ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు రాష్ట్రపతి నుంచి ..మిగతా 2లో

ఓటుతోనే మార్పు సాధ్యం

యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు

80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ..మిగతా 2లో

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలి

బియ్యం అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు.

అదనపు కలెక్టర్ మధుమోహన్

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11(ప్రభాత ఉదయం):



ప్రజలకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యంను విక్రయించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు.బుధవారం ఐడిఓసిలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో బియ్యం వ్యాపారులు, రైస్ మిల్లర్లతో సమావేశమై మాట్లాడారు. బియ్యం అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టించి దురుద్దేశంతో ధరలు పెంచే కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యాన్ని కేజీ రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం రూ.74, హెచ్ఎంటి, జెఎస్ఆర్ రకం రూ.79కు మాత్రమే విక్రయించాలన్నారు. రైస్‌మిల్లులు, గోదాములు, హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాల్లో పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.అధిక లాభాల కోసం వ్యాపారులు కుమ్మక్కై బియ్యం సరఫరాను నిలిపివేయడం, ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా దారి మళ్లించడం, తప్పుడు బిల్లులు లేదా రికార్డులతో అక్రమ వ్యాపారం నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టం నిర్దేశించిన పరిస్థితులు, తగిన ఆధారాలు ఉన్న కేసుల్లో పీడీ చట్టం కింద నిర్బంధ చర్యల కోసం సంబంధిత సమర్థ అధికారికి ప్రతిపాదనలు సమర్పిస్తామని స్పష్టం చేశారు.బియ్యం వ్యాపారులు కొనుగోలు, అమ్మకాలు, నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వర్తించే ప్రభుత్వ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలు బియ్యం కొరతపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని అదనపు కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో అవని హాస్పిటల్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ అంజలి ప్రియ

డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ అంజలి ప్రియలకు శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ నాయకులు ఎం భీమ్ రెడ్డి

పేదలకు వైద్య సేవలు అందించాలి: ఎం భీమ్ రెడ్డి

వనపర్తి, నవంబర్ 11(ప్రభాత ఉదయం)





వనపర్తి జిల్లా పట్టణ కేంద్రంలో రామకృష్ణ పురం గ్రామానికి చెందిన స్వర్గీయ గుంటి రాములు కుమారుడు డాక్టర్ శ్రావణ్ కుమార్ , సతీమణి డాక్టర్ అంజలి ప్రియ దంపతులు ఆవని హాస్పిటల్ పేరుతో ఏర్పాటుచేశారు. బుధవారం గ్రామానికి చెందిన డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ అంజలి ప్రియ లు ఏర్పాటుచేసిన హాస్పిటల్ ప్రారంభోత్సవములో మాజీ సర్పంచ్ ఎం భీమ్ రెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల రాజేశ్వరి భీమిరెడ్డి, సత్యనారాయణ రెడ్డిభాగ్యమ్మదంపతులు,మాజీ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుడు ఎం చక్రగిరి వర్ధన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, డాక్టర్ శ్రావణ్ తల్లి అను రాధ, నాన్నమ్మ భారతమ్మ , పవన్ సాగర్, రైల్ నిలయం మధు సాగర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ల కావలి జగదీష్ మాజీ (ఉ పసర్పంచ్)ఈశ్వర్ సాగర్ పాల్గొని డాక్టర్ శ్రావణ్ డాక్టర్ అంజలి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సర్వాంగ సుందరంగా పునరుద్ధరించిన తమ్మిడికుంట

మొదటి పేజీ తరువాయి...

ఆక్రమిస్తే.. ఆ నీళ్లు మన జీవితాలను ఆక్రమిస్తున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్‌ను వందేళ్ల క్రితమే అభివృద్ధి చేసుకున్నాం. హైదరాబాద్ నాగరికత మూసీ పరివాహకంలోనే అభివృద్ధి జరిగింది. ప్రపంచంలోనే ఉత్తమ ముత్యాలు మూసీ, చార్మినార్ ప్రాంతాల్లో దొరుకుతాయి" అని సీఎం అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. "హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నా అభినందనలు. తమ్మిడికుంట చెరువును చూసి చాలా బాధ కలిగింది. ఇతర దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి లేక్స్ చూసి మనం ఎందుకు చేయడం లేదు అనిపించేది. తమ్మిడికుంట అభివృద్ధిని చూసి మనమూ చేయవచ్చు అని నిరూపించారు. ఇందులో ముఖ్యమంత్రి సంకల్పం కనిపిస్తుంది. రంగనాథ్‌ను కలిసినప్పుడు నా ఆలోచన వేరేగా ఉండేది. నా ఆలోచనా విధానాన్ని మార్చి తమ్మిడికుంటను అద్భుతంగా తీర్చిదిద్దారు. తమ్మిడికుంట వద్ద డ్యాన్స్ చేయలేను కానీ షూటింగ్ చేస్తా. మన పిల్లలకు ఇచ్చే ఆస్తి ప్రకృతి. మూసీ నది పునర్జీవన ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి కూడా నన్ను పిలుస్తారని భావిస్తున్నా" అని నాగార్జున అన్నారు. తమ్మిడికుంట చెరువు అభివృద్ధికి సహకరించిన నాగార్జునను ఈ సందర్భంగా సీఎం ప్రత్యేకంగా సత్కరించారు. రూ.20 కోట్లతో తమ్మిడికుంట చెరువు పూడికతీత, చుట్టూ 1.6 కిలోమీటర్ల పాత్‌వే, అత్యాధునిక ఓపెన్ జిమ్, పిల్లల క్రీడా స్థలం తీర్చిదిద్దారు. చెరువు అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్.. సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. చెరువు అభివృద్ధిలో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోని గుడిసెలను కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేశారు.

ఓటుతోనే మార్పు సాధ్యం

మొదటి పేజీ తరువాయి...

స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

విద్య, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక ప్రాధాన్యం

హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో విద్య, ఉపాధి అవకాశాల మెరుగుదలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక వసతులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్య, మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో విద్య, నీటిపారుదల రంగాల అభివృద్ధికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బలమైన పునాదులు వేశారని సీఎం పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యాశాఖ మంత్రిగా నియమించి, యూనివర్సిటీలు, ఐఐటీల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు. సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని, బ్లూకాలర్ ఉద్యోగాలకు మాత్రం ఆ ప్రమాదం లేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విషయంలో బీజేపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మైనార్టీలకు ఇచ్చిన హామీ మేరకు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని గుర్తుచేశారు. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూసీ అభివృద్ధి పూర్తయితే పాతబస్తీకి పర్యాటకుల రాక పెరుగుతుందని, నగరంలో నైట్ ఎకానమీకి ఊతం లభిస్తుందని చెప్పారు. ఎస్ఐఆర్ పేరుతో పేదలు, మైనార్టీలు, ఎస్టీల ఓట్లు తొలగిస్తున్నారని బీజేపీపై ఆరోపణలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మోదీని ఓడించడమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు.

తెలంగాణలోనే తొలి స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌కు గుర్తింపు

మొదటి పేజీ తరువాయి...

ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పట్టణ పారిశుద్ధ్య ప్రమాణాలు, నగర పరిసరాల పరిశుభ్రత, సమర్థవంతమైన ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) వంటి కీలక విభాగాల్లో హైదరాబాద్ చేపట్టిన వినూత్న చర్యలు, అమలు చేసిన విధానాలకు ఈ గుర్తింపు దక్కింది. నగరంలో చెత్త సేకరణ, ప్రాసెసింగ్, పారిశుద్ధ్య వ్యవస్థను ఆధునీకరించడంలో చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు రావడం పట్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) హర్షం వ్యక్తం చేసింది. ఇది జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు నగర పౌరులందరి సమష్టి కృషితోనే సాధ్యమైందని జీహెచ్ఎంసీ తమ అధికారిక ప్రకటనలో పేర్కొంది. భవిష్యత్తులో కూడా నగరాన్ని మరింత పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ఈ పురస్కారం కొత్త ఉత్సాహాన్నిస్తుందని అధికారులు తెలిపారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం-2026 సందర్భంగా మూడు ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11(ప్రభాత ఉదయం):

జాతీయ న్యాయ సేవల దినోత్సవం--2026 సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మల్దకల్ మండలంలో మూడు ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతు వేదిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన కార్యక్రమాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు అర్హత మేరకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. న్యాయ సహాయం కోసం న్యాయవాది ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నలసా టోల్‌ఫ్రీ నంబర్ 15100 ద్వారా న్యాయ సలహాలు, సహాయం పొందవచ్చని వివరించారు. పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులు, పోక్సో చట్టం--2012, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. బాలికలు తమ హక్కులు తెలుసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. వేధింపులు ఎదురైతే మౌనంగా ఉండకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ప్రధానోపాధ్యాయుడు సురేష్, కేజీబీవీ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పారా లీగల్ వాలంటీర్ నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆశలకు స్థిర వేతనం 18,000 రూపాయలు ఇవ్వాలి

ఆశల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

ఎమ్మెల్యే కృష్ణారావుకు సమ్మె నోటీసు అందజేసిన ఆశలు

డిసెంబరు 15 నుంచి సమ్మెకు సిద్ధమైన ఆశ కార్యకర్తలు

కూకట్‌పల్లి, నవంబరు 11 (ప్రభాత ఉదయం)

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశలు డిసెంబరు 15న సమ్మెలోకి వెళ్తున్నామని, తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాధవరం కృష్ణారావుకు సమ్మె నోటీసు అందజేశారు.ఈ కార్యక్రమంలో భారతీయ కార్మిక సంఘాల కేంద్రం జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ ఆశలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆశలకు స్థిర వేతనం 18,000 రూపాయలు అమలు చేస్తామని ఎన్నికలలో హామీలు ఇచ్చారని, ధర్నాల దగ్గరకు వచ్చి హామీలు ఇచ్చారని, కానీ ఆశల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశలకు వేతనాలు పెంచాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో డిసెంబరు 15 నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశలు రోడ్ల మీదకు వస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశ సంఘం జిల్లా అధ్యక్షురాలు డి. అనిత, భాషమ్మ, భాగ్యలక్ష్మి, సంతోష్ భాయ్, యాదమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాల పాల్గొన్న సామాజికవేత్త చుక్క సుదర్శన్ రెడ్డి

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11(ప్రభాత ఉదయం):


కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు భాగంగా బుధవారం ప్రముఖ సామాజికవేత్త, సీనియర్ జర్నలిస్ట్ చుక్క సుదర్శన్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.




శాస్త్రోక్తంగా చక్రస్నానం.. ముగిసిన పాగుంట బ్రహ్మోత్సవాలు

వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా ముగింపు వేడుకలు

కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో కొలువుదీరిన పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల చివరిరోజు నిర్వహించిన చక్రస్నాన ఘట్టం భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ సమీపంలోని పుష్కరిణిలో వేదమంత్రోచ్చారణల నడుమ చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం నిత్యహోమం, శ్రీహయగ్రీవ ఇష్టి, లఘు పూర్ణాహుతి కార్యక్రమాలను ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు మహాపూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన చక్రస్నాన ఘట్టంలో భక్తులు





భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. స్వామివారి కృపకు పాత్రులు కావాలనే ఆకాంక్షతో భక్తులు పూజా కార్యక్రమాలను తిలకించారు.రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడ పటాన్ని అవనతం చేయడంతో బ్రహ్మోత్సవాలకు సంప్రదాయబద్ధంగా ముగింపు పలికారు. దీంతో అయిదు రోజులుగా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన పాగుంట ఆలయ పరిసరాల్లో బ్రహ్మోత్సవాల సందడి ముగిసింది.


వీధి వ్యాపారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

మహిళలు ఆర్థికంగా బాగు పడాలి : మహిళా కమిషన్ సభ్యురాలు ఎ సదాలక్ష్మి

6వేల మంది వీధి వ్యాపారుల కు రూ. 18 కోట్లు రుణాలుగా ఇప్పించాం: రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, నవంబరు 11 (ప్రభాత ఉదయం) :

వీధి వ్యాపారుల కు ఆర్థికంగా భరోసా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి పి యం స్వా నిధి కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ జోన్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని ఓ ఎస్ ప్రైడ్ ఫంక్షన్ హాల్‌లో లో బుధవారం జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఉన్న ఆరు సర్కిళ్ల లోని వీధి వ్యాపారుల తో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి (పీ ఎం స్వా నిధి) పథకం ద్వారా వీధి వ్యాపారులకు అందుతున్న ఆర్థిక సహాయం, డిజిటల్ లావాదేవీలు, వారి ఉపాధి అవకాశాల అభివృద్ధిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. వీధి వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమావేశానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఎ సదాలక్ష్మి మాట్లాడుతూ, వీధి వ్యాపారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో ముఖ్యంగా మహిళలే




సమావేశంలో పాల్గొన్న వీధి వ్యాపారులు



పీ ఎం స్వా నిధి కార్యక్రమం పై వీధి వ్యాపారుల కు నిర్వహించిన అవగాహన సమావేశం లో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఎ సదాలక్ష్మి, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి లు

ఎక్కువగా వీధి వ్యాపారులు ఉంటారని గుర్తు చేశారు. వీధి వ్యాపారులుగా ఉన్న మహిళలందరూ పొదుపు సంఘాలలో సభ్యులుగా ఉండాలని, పొదుపు ద్వారా అనేక మేలు లు జరుగుతాయన్నారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో పొదుపు సంఘాలు బాగా పనిచేస్తున్నాయని, అధికారుల ప్రోత్సాహం కూడా బాగుంటుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, తద్వారా ఆ ప్రాంతం, ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంద న్నారు. మహిళలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జోన్ పరిధిలోని ఆరు సర్కిళ్ల లో 15 వేల మంది వీధి వ్యాపారులను గుర్తించి వాళ్ళందరికీ ఐడి కార్డులను అందజేయడం జరిగిందన్నారు. పీఎం స్వా నిధి పథకంలో భాగంగా 6 వేల మంది వీధి వ్యాపారులకు రూ. 18 కోట్ల రుణాలను ఇప్పించామన్నారు. మరో 9 వేల మంది వీధి వ్యాపారులు కూడా బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలను ఇప్పించడానికి కృషి జరుగుతుందన్నారు. సమావేశంలో వీధి వ్యాపారులు తీసుకున్న రుణాలను ఎలా చెల్లించాలి, బ్యాంకు రుణాలు పొంద డానికి విధి విధానాలేంటి అనే వివరాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వీధి వ్యాపారుల ను స్ట్రీమ్ లైన్ చేసి వారందరికీ రుణాలు అందించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు లోక పెద్ద మల్లయ్య, అరుణకుమారి, పి పాపయ్య, అహ్మద్ సైఫుల్లా , వి సురేందర్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ లు కరుణాకర్, స్వాతి, యాదవ రెడ్డి, అన్ని సర్కిళ్ల కమ్యూనిటీ ఆర్గనైజర్ లు పాల్గొన్నారు.



ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతోత్సవం

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్, 11(ప్రభాత ఉదయం):

మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ, భారతదేశంలో విద్యా వ్యవస్థకు పటిష్టమైన పునాదులు వేసిన దార్శనిక విద్యావేత్తగా ఆయనను అభివర్ణించారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డా.వి.నరేందర్ రెడ్డి కరీంనగర్ సిటీ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ స్థానిక కరీంనగర్లోని షే సాహెబ్ లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో (ఉర్దూ మీడియం) లో నిర్వహించినటువంటి వారి జయంతోత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ1947 నుండి 1958 వరకు సుమారు 11 సంవత్సరాల పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఆజాద్, భారతదేశ విద్యా రంగంలో అనేక చారిత్రాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు.దేశంలో ఉన్నత విద్య, , సాంకేతిక విద్య అభివృద్ధికి విశేష కృషి చేసి, ఐఐటీ ఖరగ్‌పూర్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్, ఏఐసిటిఈ, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, సాంస్కృతిక సంస్థలైన ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్, కేంద్ర సాహిత్య అకాడమీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల స్థాపనకు పునాదులు వేశారని పేర్కొన్నారు. వారి సేవలను స్మరించుకుంటూ భారతదేశ ప్రభుత్వం వారి యొక్క జయంతిని జాతీయ విద్యా దినోత్సవం మరియు జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవం గా జరుపుకుంటున్నారని వారు చెప్పారు. భారతదేశ ప్రభుత్వం వారి సేవలను గుర్తిస్తూ వారి మరణానంతరం 1992లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన "భారతరత్న" తో సత్కరించి గౌరవించింది. వారి జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ లోని షే సాహెబ్ లో గల ప్రభుత్వ బాలికల హై స్కూల్ లో జయంతోత్సవాలను చాలా గొప్పగా నిర్వహించారు. పలు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించి విజేతలకు పాడ్స్ మరియు పెన్నులను బహూకరించారు మరియు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఎస్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్ , ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ ఖాన్ , ఇన్చార్జి హెచ్ఎం ఆసియా , ఇమ్రాన్ ఘని - అర్బన్ డిసిసి జనరల్ సెక్రెటరీ, సత్తినేని శ్రీనివాస్ - అర్బన్ డిసిసి జనరల్ సెక్రెటరీ, కె అశోక్ అర్బన్ డిసిసి జనరల్ సెక్రెటరీ, శ్రీకాంత్ , - 31 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పొన్నాల రాజేష్ , - 28 డివిజన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తాళ్లపల్లి శ్రీకాంత్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి , అనుబంధ సంస్థల నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం పేరును అవ్రదిష్ట పాలు చేయవద్దని నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

వీసీ జానయ్యపై ఆరోపణలు కక్షపూరితమే

బదిలీల వివాదాన్ని యూనివర్సిటీ ప్రతిష్ఠకు ముడిపెట్టొద్దు

ఆరోపణలను ఖండించిన వర్సిటీ వర్గాలు

రాజేంద్రనగర్,నవంబర్11(ప్రభాత ఉదయం):

వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జానయ్యపై వస్తున్న ఆరోపణలు కుట్రపూరితమైనవని,విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో కొందరు వ్యవహరిస్తున్నారని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ యాదవ్,విమర్శించారు.బదిలీ అయిన కొందరు ఉద్యోగులు,గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన వ్యక్తులు కావాలనే వీసీని,విశ్వవిద్యాలయాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నారని ఆరోపించారు.తొమ్మిది నెలల క్రితం జరిగిన విషయాలను ఇప్పుడు పెద్దవిగా చూపిస్తూ వివాదాలు సృష్టిస్తున్నారని అన్నారు.జానయ్య గతంలో బోర్డు సభ్యుడిగా,ప్రిన్సిపాల్‌గా,విభాగాధిపతిగా,వైస్ ఛాన్సలర్‌గా పలు బాధ్యతలు నిర్వహించారని,ఇప్పటివరకు ఆయనపై ఇలాంటి ఆరోపణలు రాలేదని పేర్కొన్నారు.బీసీ వర్గానికి చెందిన వ్యక్తి రిజిస్ట్రార్‌గా,వీసీగా బాధ్యతలు నిర్వహించడం కొందరికి నచ్చడం లేదని వ్యాఖ్యానించారు.విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులపై కూడా సమాచార హక్కు చట్టం కింద పదేపదే వివరాలు కోరుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.పదోన్నతుల అనంతరం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసినప్పుడు అక్కడ విధులు నిర్వర్తించకుండా హైదరాబాద్‌లోనే కొనసాగాలని పట్టుబడుతున్న కొందరు,బదిలీల అనంతరం మీడియా ద్వారా వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు.విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వారంతా ఇలాంటి కక్షపూరిత ఆరోపణలను ఖండించాలని వక్త పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా "బదిలీ చేస్తే బదలామా?" అంటూ నినాదాలు చేస్తూ వీసీకి మద్దతుగా "వీసీ జిందాబాద్" అని నినదించారు.

బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ వైస్ చాన్సలర్‌పై ఇచ్చిన ఫిర్యాదుకు రశీదు ఇవ్వాలని మంగళవారం అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కె కవిత

బుద్వేల్, నవంబరు 11 (ప్రభాత ఉదయం)

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తనను లైంగికంగా వేదించాడని 15 రోజులుగా బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ పోలీసుల చుట్టు తిరుగుతున్న, ప్రభుత్వానికి విన్నవించుకు ంటున్న ఎవరు పట్టించుకోకపోవడం బాధాకరమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం సాయంత్రం బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ రాజేంద్రనగర్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిందని ఆమెకు ఫిర్యాదు చేసిన రశీదు ఇవ్వాలని పోలీసులను కోరగా వారు రాత్రి 2 గంటలైనా ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. తేజశ్రీ కి మద్దతుగా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తో పాటు ఆ పార్టీ నాయకులు. వ్యవసాయ విశ్వవిద్యాలయం



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం అర్ధరాత్రి వరకు బైఠాయించిన టీ ఆర్ ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

అద్యాపకులు డాక్టర్ త్రివేణి, డాక్టర్ సల్లా సౌజన్య, కె సునీత, నాన్ టీచింగ్ ఎప్లాయిస్ అసోసియేషన్ టెక్నికల్ కార్యదర్శి సులోచన తో పాటు విద్యార్థులు మంగళవారం అర్ధరాత్రి వరకు పోలీసు స్టేషన్ ముం దు బైఠాయించారు.

ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ప్రభుత్వం ఓ బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ కు న్యాయం చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. తనకు అన్యాయం జరిగించని ఆమె బయటకు వచ్చి బహిరంగంగా చెప్పుకుంటున్న ఎవరు పట్టించుకోకపోగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యకు వత్తాసు పలుకుతున్నట్లు కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళల పట్ల గానీ, వారి రక్షణ పట్ల గానీ చిత్తశుద్ధి లేదన్నారు. బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంట టీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ లో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అలాస్ జానయ్య పై ఫిర్యాదు చేసిన అక్నలెడ్జ్ మెంట్ ఇవ్వాలని కోరగా, పోలీసులు ఇవ్వకపోవడంతో కవిత నేరుగా ఫోన్ లో రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ తో మాట్లాడారు. అయినా బుధవారం సాయం త్రం వరకు కూడా వైస్ చాన్సలర్ పై చేసిన ఫిర్యాదు కు రశీదు ఇవ్వలేదు.



ఫిర్యాదు చేస్తే రశీదు ఎందుకు ఇవ్వడంలేదని రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ ఆర్. వెంకటేష్ ను ప్రశ్నిస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఫిర్యాదు చేస్తే రశీదు ఎందుకు ఇవ్వడం లేదు

ఇన్స్ పెక్టర్ ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు న్యాయవాది గాలి వినోద్ కుమార్

బుద్వేల్, నవంబరు 11 (ప్రభాత ఉదయం)

వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పై తనను వాట్సాప్ ద్వారా లైంగికంగా వేదించాడని అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేయగా రశీదు ఎందుకు ఇవ్వడం లేదని రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ ఆర్ వెంకటేశ్ పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, వర్శిటీ ఉద్యోగులు, పీహెచ్ స్కాలర్లు ప్రశ్నల వర్షం కురిపించారు. బుధవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల వద్ద గల ప్రొఫెసర్ జయశం కర్ సార్ ప్రాంగణం వద్ద నిరసన చేస్తున్న ప్రాంతంలో ఉన్న ఇన్స్పెక్టర్ ఆర్ వెంకటేశ్ ను అక్కడికి వచ్చిన గాలి వినోద్ కుమార్ ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ఆలస్యంగా ఇచ్చిన ఫర్వాలేదని, ఫిర్యాదు ముట్టినట్లు రసీదు ఇవ్వాలి కదా అని అడిగితే.. తేజశ్రీ గతంలో ఉమెన్ సేఫ్టీ వింగ్కు ఫిర్యాదు చేసిందని, ఆ ఫిర్యాదు ఏమైందోనని తెలుసుకోవా లన్నారు. పని ప్రదేశంలో ఆమెపై లైంగిక వేధింపులు జరిగాయని ఫిర్యాదు లో పేర్కొన్న దృష్ట్యా పోష్ యాక్ట్ - 2013 ప్రకారం వర్శిటీ పోష్ యాక్ట్ కమిటీ నుంచి నివేదిక వచ్చాక పరిశీలించి రశీదు ఇస్తామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య

బుద్వేల్, నవంబరు 11 (ప్రభాత ఉదయం)

ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ బన్సీలాల్ నగర్ కాలనీ లో జరిగింది. ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి..... షాద్ నగర్ కొందురు ప్రాంతానికి చెందిన గోపి శ్రీకాంత్ (27)ప్రైవేటు ఉద్యోగి. బన్సీలాల్ నగర్ లో సోదరుని ఇంట్లో ఉం టు ఉద్యోగం చేసుకుంటున్నాడు. బుధవారం గోపి శ్రీకాంత్ తన గది లో చీర తో ఉరి వేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఎంతకు శ్రీకాంత్ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చూరీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చేస్తున్నారు.



తేజశ్రీ కు మద్దతుగా మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయవాది. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

వీసీ జానయ్య రాజీనామా చేయాలి

మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి..

నిష్పక్షపాత విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి: ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్

రాజేంద్రనగర్,నవంబర్11(ప్రభాత ఉదయం)

మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజ శ్రీ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తక్షణమే నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని సుప్రీంకోర్టు న్యాయవాది,ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆందోళన చేస్తున్న బాధిత మహిళా ప్రొఫెసర్ తేజశ్రీ ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది,విద్యార్థులను ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళా ప్రొఫెసర్ చేసిన ఫిర్యాదును సాధారణంగా తీసుకోరాదని,ఆమెకు న్యాయం జరిగేలా ప్రభుత్వం,సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 ప్రకారం విశ్వవిద్యాలయంలో సమర్థవంతమైన అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసి,అందులో మహిళా సభ్యులు,సీనియర్ ప్రొఫెసర్లకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు.ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి,బాధితురాలు అందించే ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు.వీసీపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన విచారణ ప్రక్రియను ప్రభావితం చేయకుండా బాధ్యతల నుంచి తప్పుకోవాలని,నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విచారణ కమిటీ స్వతంత్రంగా వ్యవహరించాలని,బాధితురాలికి ఎలాంటి ఒత్తిళ్లు,బెదిరింపులు లేకుండా రక్షణ కల్పించాలని కోరారు.తనపై వచ్చిన ఆరోపణలకు వీసీ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని,విశ్వవిద్యాలయం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని,అది విద్యార్థులు,ఉపాధ్యాయులు,ఉద్యోగులందరికీ చెందిన విద్యాసంస్థ అని వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం,భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు.మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుపై పోలీసులు చట్టప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై దర్యాప్తు చేయడం పోలీసుల బాధ్యతని,ఆరోపణలు నిజమా కాదా అనేది విచారణ,న్యాయ ప్రక్రియ ద్వారా తేలాలని అన్నారు.పోలీసులు ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోతే బాధితురాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని,అవసరమైతే న్యాయపర మైన సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.చట్టం ముందు అందరూ సమానమేనని,ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నవారైనా చట్టానికి లోబడి ఉండాల్సిందేనని పేర్కొన్నారు.మహిళా ప్రొఫెసర్ ధైర్యంగా ముందుకొచ్చి తనకు ఎదురైన అనుభవాలను వెల్లడించడం చిన్న విషయం కాదని,ఆమెకు న్యాయం జరిగేలా సమాజం,విద్యాసంస్థలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.బాధితురాలి ఆరోపణలను పక్కదారి పట్టించేలా వ్యక్తిగత విమర్శలు చేయడం,బదిలీల కారణంగా ఫిర్యాదు చేశారం టూ ప్రచారం చేయడం సరికాదని అన్నారు.విశ్వవిద్యాలయంలో బదిలీలు,పదోన్నతులు, పరిశోధనా అర్హతలు,పరిపాలనా నిర్ణయాలపై కూడా అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయని,వాటిపై సంబంధిత అధికారులు పారదర్శకంగా విచారణ జరిపించాలని కోరారు.విద్యాసంస్థలో అవినీతి,అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉంటే వాటిని కూడా ఆధారాలతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.బాధిత ప్రొఫెసర్‌కు న్యాయం చేయాల్సిన సమయంలో నిరసనలకు మద్దతు తెలిపేందుకు వచ్చే నాయకులు,విద్యార్థులు,ఉద్యోగులను అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదని విమర్శించారు.శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని,అరెస్టులపై కాకుండా ఫిర్యాదుపై చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.విశ్వవిద్యాలయంలో నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి,బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ పూర్తయ్యే వరకు ఈ వ్యవహారాన్ని నిర్లక్ష్యం చేయరాదని,న్యాయం జరిగే వరకు బాధితురాలి పక్షాన చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

భూ రీసర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)



భూ రీసర్వే ప్రక్రియలో ప్రతి రైతుకు సంబంధించిన భూములను క్షేత్రస్థాయిలో కచ్చితంగా గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం ఇబ్రహీంపట్నం మండలం రాందాస్‌పల్లి గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరును, రైతుల భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతుకు చెందిన భూమి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించి, భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సర్వే నిర్వహణకు కనీసం 24 గంటల ముందుగానే సంబంధిత గ్రామంలోని పట్టాదారులకు నోటీసులు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ రోజు, ఏ సమయంలో, ఏ ప్రాంతంలో సర్వే నిర్వహించనున్నారనే వివరాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని, నోటీసులు అందించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేకు హాజరైన రైతులతో పాటు, నోటీసులు అందించినప్పటికీ హాజరుకాని పట్టాదారుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు.సర్వే నంబర్ల ప్రాతిపదికన మాత్రమే కాకుండా రైతుల వారీగా భూములను గుర్తించి హద్దులు నిర్ధారించాలని తెలిపారు. ప్రతి రైతుకు చెందిన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చోట ఫ్లాగ్‌లు ఏర్పాటు చేసి, రైతులకు భూమి సరిహద్దులను ప్రత్యక్షంగా చూపిస్తూ వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం భూమి విస్తీర్ణం, సరిహద్దులు, ఇతర వివరాలను కచ్చితంగా నమోదు చేసి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సర్వే వివరాలకు, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలకు మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు.భూ రీసర్వే ప్రక్రియపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ సర్వేలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా వివరించాలని కలెక్టర్ సూచించారు. రైతుల సమక్షంలోనే భూముల హద్దులను నిర్ధారించడం ద్వారా సర్వే ప్రక్రియపై వారిలో విశ్వాసం కల్పించాలన్నారు. సర్వే బృందాలు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు చేరుకుని, సంబంధిత రైతులకు ముందస్తు సమాచారం అందిస్తూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం, తొందరపాటు నిర్ణయాలు, తప్పిదాలకు ఏమాత్రం తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. భూ రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ సునీత, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశం లో మాట్లాడుతున్న ముఖ్య అతిథి తాళ సూమాలిని



సమావేశానికి హాజరైన విద్యార్థులు ఉపాధ్యాయులు..

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

విద్యార్థులు నైపుణ్యాలు, విలువలతో కూడిన గుణాత్మక విద్యను అలవర్చుకోవాలి

జాతీయ విద్యా దినోత్సవంలో హెచ్‌సీయూ ఆచార్యులు తాళ్ల సుమాలిని

శేరిలింగంపల్లి : నవంబర్ 11, (ప్రభాత ఉదయం)

విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ శ్రేయస్సు, దేశ ప్రగతికి పునాది అని విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ విలువలతో కూడిన గుణాత్మక విద్యను అభ్యసించాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ విభాగం ఆచార్యులు తాళ్ల సుమాలిని సూచించారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య ఎంత అవసరమో వివరించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య తాళ్ల సుమాలిని మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, పండితుడిగా, కవిగా, సంపాదకుడిగా, రాజనీతిజ్ఞుడిగా ఆజాద్ దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పదేళ్లపాటు జైలు జీవితం గడిపిన ఆయన,స్వాతంత్ర్యానంతరం 11 సంవత్సరాల పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసి భారత విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. దేశంలో ప్రాథమిక, ఉన్నత, మాధ్యమిక విద్యాభివృద్ధికి ప్రత్యేక కమిషన్లను ఏర్పాటు చేయడంతో పాటు యూజీసీ, ఏఐసీటీఈ, ఐసీసీఆర్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఖరగ్‌పూర్‌లో తొలి ఐఐటీ స్థాపనకు కృషి చేశారని, సంగీతం, సాహిత్యం, నాటక, లలిత కళల అభివృద్ధికి వివిధ అకాడమీలను ఏర్పాటు చేయించారని వివరించారు. బాలబాలికలకు విద్య అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా బాలికల విద్యకు ప్రాధాన్యత కల్పించాలని ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. విద్య ద్వారా జ్ఞానం, ధైర్యం, సంస్కారం అలవడటమే కాకుండా ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబన, సామాజిక స్థిరత్వం పెరుగుతాయని అన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో అంతర్జాలం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చిందని, విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అమె సూచించారు. సామాజిక మాధ్యమాలు, అంతర్జాల వినియోగంలో సమయపాలన పాటించాలని, విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థులు ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాయామం, ధ్యానం చేయాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడంతో పాటు భాషా నైపుణ్యాలు, చక్కని చేతిరాత, ఏకాగ్రత, క్రమశిక్షణను పెంపొందించుకోవాలని చెప్పారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ దేశాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా సంపూర్ణ అక్షరాస్యత సాధనకు కృషి చేయడమే అబుల్ కలాం ఆజాద్‌కు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, ఉపాధ్యాయులు రామేశ్వరరెడ్డి, ప్రభాస్ కుమార్, మధు, జాఫర్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎల్ నినో, వేసవి తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ జలవనరులపై జలమండలి దృష్టి

గండిపేటలో పర్యటించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఉన్నతాధికారుల బృందం

ఎల్‌నినో ప్రభావం, రాబోయే వేసవి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు చర్యలు

సింగూరు-మంజీరా జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి

జంట జలాశయాల నుంచి అదనపు తాగునీటి సరఫరా అవకాశాల పరిశీలన

ప్రత్యామ్నాయ మార్గాలు, పైప్‌లైన్ అనుసంధానంపై క్షేత్రస్థాయి పరిశీలన

హైదరాబాద్, నవంబర్ 11(ప్రభాత ఉదయం)



ఎల్‌నినో ప్రభావం, రాబోయే వేసవిలో తాగునీటి సరఫరాలో తలెత్తే అవకాశం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలను ముమ్మరం చేస్తోంది. ముఖ్యంగా నగరానికి ప్రధాన జలవనరులైన సింగూరు-మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది.ఇందులో భాగంగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి బుధవారం ఉన్నతాధికారుల బృందంతో కలిసి గండిపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల నుంచి నగరానికి అదనపు తాగునీటిని సరఫరా చేసే సాధ్యాసాధ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ప్రధానంగా రాబోయే ఫిబ్రవరి, మార్చి నెలల్లో పెరిగే తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, జంట జలాశయాల నుంచి అదనంగా ఎంత నీటిని సేకరించవచ్చు, ఏ మార్గాల్లో తరలించవచ్చు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పైప్‌లైన్ వ్యవస్థతో ఎలా అనుసంధానం చేయవచ్చనే అంశాలపై అధికారులతో చర్చించారు.అదనపు నీటి తరలింపునకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రత్యామ్నాయ పైప్‌లైన్ మార్గాలు, భవిష్యత్ విస్తరణ అవకాశాలను పరిశీలించారు. నీటి లభ్యత, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, సరఫరా వ్యవస్థ సామర్థ్యాన్ని సమగ్రంగా అంచనా వేసిన అనంతరం తదుపరి కార్యాచరణను రూపొందించనున్నారు. రాబోయే వేసవిలో తాగునీటి డిమాండ్ పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న ప్రతి జలవనరును సమర్థంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని ఎండీ అధికారులకు సూచించారు. ముఖ్యంగా సింగూరు-మంజీరా జలవనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాల సాధ్యాసాధ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అన్ని అవకాశాలను పరిశీలిస్తూ, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు జలమండలి వెల్లడించింది.ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్ట్స్ డైరెక్టర్ మహేష్ కుమార్, సీఈఓ రాంబాబుతో పాటు ప్రాజెక్టు, ట్రాన్స్‌మిషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సబ్‌జూనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎం.కె. జయకృష్ణ ఎంపిక

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11(ప్రభాత ఉదయం):

వికారాబాద్ జిల్లాలో నవంబర్ 12 నుండి నిర్వహించనున్న సబ్‌జూనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు గద్వాలలోని ప్రాక్టిసింగ్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి ఎం.కె. జయకృష్ణ ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బి.విష్ణు, పీఈటి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వారు అభినందించారు.



అయిజలో 134.55 కేజీల క్లోరల్ హైడ్రేట్ స్వాధీనం..నిందితుడి అరెస్ట్

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11(ప్రభాత ఉదయం):

మహబూబ్ నగర్ జిల్లా అబ్కారీ శాఖ డిప్యూటి కమీషనర్ ఆదేశాల మేరకు, గద్వాల జిల్లా మద్యనిషేధ , అబ్కారీ అధికారి పర్యవేక్షణలో గద్వాల జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం భారీగా క్లోరల్ హైడ్రేట్ స్వాధీనం చేసుకున్నారు. గద్వాల జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్సై అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అయిజ పట్టణంలో అబ్కారీ పోలీసులు దాడులు నిర్వహించారు. అయిజకు చెందిన గుండ్రతి రవీందర్ గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 134.55 కేజీల క్లోరల్ హైడ్రేట్ రసాయనాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడులో అబ్కారీ సిబ్బంది హర్షవర్ధన్ గౌడ్, వంశీ గౌడ్, నవీన్ పాల్గొన్నారు.




చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు

సంగాల రిజర్వాయర్‌లో వలలో చిక్కుకుని ప్రమాదం.. గజ ఈతగాళ్లతో గాలింపు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11(ప్రభాత ఉదయం):

చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ధరూర్ మండలం సంగాల రిజర్వాయర్‌లో గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ధరూర్ పోలీసుల వివరాల ప్రకారం.. గద్వాల పట్టణానికి చెందిన వెంకటేష్ తన సోదరుడితో కలిసి చేపలు పట్టేందుకు సంగాల రిజర్వాయర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో రిజర్వాయర్ మధ్యలో లోతైన ప్రాంతంలో చేపలు పడుతుండగా వలలో చిక్కుకుని నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, ధరూర్ ఎస్ఐ తారక సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడి ఆచూకీ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు.



రైతుల ధర్నాకు మద్దతుగా నిలిచిన మాజీ జడ్పీటీసీపై కేసు

బాసు శ్యామలకు పోలీసుల నోటీసులు..

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11(ప్రభాత ఉదయం):

జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని సెప్టెంబర్ 21న గద్వాల పట్టణ పరిధిలో జమ్మిచేడు సమీపంలో రైతులు చేపట్టిన రాస్తారోకోకు మద్దతుగా నిలిచిన మాజీ జడ్పీటీసీ బాసు శ్యామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం గద్వాలలో ఆమె నివాసానికి పోలీసులు వెళ్లి నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా బాసు శ్యామల మాట్లాడుతూ.. సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కితే కేసులు నమోదు చేస్తారా? రైతులకు మద్దతుగా నిలిస్తే కేసులు పెడతారా? ఎన్ని కేసులైనా పెట్టుకోండి అంటూ వ్యాఖ్యానించారు.

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి





ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేసి, పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, సర్వే , ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత శాఖల అధికారులతో భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సాంకేతిక అంశాలు, రైతుల స్పందన, సర్వే సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సుదీర్ఘ కాలం తర్వాత చేపట్టిన సమగ్ర భూ రీసర్వే కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత కలిగినదని, తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి వారి భూమిపై స్పష్టమైన హక్కులు, ఖచ్చితమైన సరిహద్దులు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 10 వేల 954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, మొదటి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలలో ఒక్కో జిల్లాకు 70 గ్రామాల చొప్పున మొత్తం 2 వేల 720 గ్రామాలలో రీసర్వే చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1 వేయి గ్రామాలలో సర్వే పనులు ప్రారంభం కాగా,416 గ్రామాలలో సర్వే ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన గ్రామాలలో పనులను వేగవంతం చేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు.భూ రీసర్వే చేపట్టే సమయంలో పాత రెవెన్యూ రికార్డులు, పహాణీలు, సెత్వార్, టిప్పన్, ఎఫ్.ఎం.బి., గ్రామ నక్షాలు, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణం, సబ్ డివిజన్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, రికార్డులలో ఉన్న వివరాలను క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులతో సరిపోల్చుకుంటూ సర్వే నిర్వహించాలని తెలిపారు. భూముల సరిహద్దులు, సర్వే నంబర్ల విభజనలు, విస్తీర్ణంలో ఉన్న వ్యత్యాసాలను గుర్తించి సంబంధిత ఆధారాలతో పరిశీలించాలని, సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. భూ రీసర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలోవినియోగించుకోవాలని డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్, రోవర్లు, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, క్యూ జి ఐ ఎస్ వంటి సాంకేతిక పద్ధతుల ద్వారా భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని తెలిపారు. సర్వే ద్వారా సేకరించిన భూముల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసి భద్రపరచాలని, భూముల విస్తీర్ణం, సరిహద్దులు, సర్వే నంబర్లు తదితర వివరాలను సాంకేతిక వ్యవస్థలలో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశంగా భూ యజమానులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, వారి భూముల విస్తీర్ణం, సరిహద్దులు, సర్వే నంబర్లు, ఇతర వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పించాలని తెలిపారు. నోటీసులు సంబంధిత భూ యజమానులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, నోటీసుల జారీకి సంబంధించిన రికార్డులను నిర్వహించాలని సూచించారు. భూ యజమానులకు తమ భూముల వివరాలపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే నిర్ణీత గడువులో సమర్పించుకునే అవకాశం కల్పించాలన్నారు. రీసర్వేలో గుర్తించిన భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలపై రైతులు, భూ యజమానుల నుంచి వచ్చే అభ్యంతరాలను నిర్లక్ష్యం చేయకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి అభ్యంతరానికి సంబంధించిన వివరాలు, దరఖాస్తుదారుల వివరాలు, సంబంధిత సర్వే నంబర్లు, సమర్పించిన ఆధారాలు నమోదు చేసి, సంబంధిత అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని తెలిపారు. అవసరమైన సందర్భాలలో పాత రెవెన్యూ రికార్డులు, సర్వే నక్షాలు, ఇతర భూ పత్రాలను పరిశీలించి, సంబంధిత భూ యజమానుల వాదనలు విన్న అనంతరం నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సర్వే ఫలితాలతో ఏకీభవించని భూయజమానులకు వర్తించే నిబంధనల ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశాన్ని తెలియజేయాలని తెలిపారు. అప్పీళ్లను సంబంధిత సమర్థ అధికారుల పరిధిలో స్వీకరించి, విచారణ నిర్వహించి, తగిన ఆధారాల ఆధారంగా పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అభ్యంతరాలు, అప్పీళ్లను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని, పరిష్కరించిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను వేర్వేరుగా నమోదు చేయాలని, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ రీసర్వే కార్యక్రమంపై రైతులు, భూ యజమానులు, గ్రామ ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, రీసర్వే చేపట్టేందుకు గల కారణం, సర్వే విధానం, భూముల హద్దుల గుర్తింపు, నోటీసుల జారీ, అభ్యంతరాల సమర్పణ, ఆపిల్ విధానం అంశాలపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ సభలు, రైతు సమావేశాలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి కరపత్రాలు, మైక్ ప్రకటనలు, ఇతర సమాచార మాధ్యమాల ద్వారా ప్రజలకు వివరాలు తెలియజేయాలని సూచించారు. రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, భూముల సరిహద్దుల నిర్ధారణ, భవిష్యత్తులో భూ వివాదాల నివారణ, డిజిటల్ భూ రికార్డుల ప్రాధాన్యతపై రైతులకు వివరించాలని తెలిపారు. ప్రజలలో ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేసి, ప్రతి భూ యజమాని ఈ ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. రీసర్వే పూర్తయిన గ్రామాలలో ప్రతి భూ కమతానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యగా భూదార్ నంబర్ కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని, భూముల హద్దులు, విస్తీర్ణం, సంబంధిత రికార్డుల వివరాలను సమగ్రంగా నమోదు చేసి భూ భారతి పోర్టల్‌తో అనుసంధానం చేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో భూముల కొనుగోలు, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ముటేషన్ల సమయంలో భూ యజమానులకు ఎదురయ్యే సమస్యలను తగ్గించేలా రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు తమ పరిధిలోని రీసర్వే గ్రామాల వారీగా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), రాజస్వ మండల అధికారులు, సబ్ కలెక్టర్లు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సర్వే ప్రారంభం, పూర్తయిన పనులు, నోటీసుల జారీ, అభ్యంతరాల స్వీకరణ, అప్పీళ్ల పరిష్కారం, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన సాంకేతిక పరికరాలు, శిక్షణ, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. భూ రీసర్వే అనేది కేవలం భూముల కొలతలకు సంబంధించిన కార్యక్రమం మాత్రమే కాదని, భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా ప్రతి భూ యజమానికి భద్రమైన హక్కులు కల్పించే కీలక కార్యక్రమమని, అధికారులు బాధ్యతాయుతంగా పారదర్శకంగా, సమన్వయంతో పనిచేసి రాష్ట్రవ్యాప్తంగా భూ రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద అర్హులైన పేదలకు కేటాయించిన స్థలాల విషయంలో ఎవరూ అనవసరంగా అభ్యంతరాలు వ్యక్తం చేయడం, లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగించడం, స్థలాల వద్ద సమస్యలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడకుండా పర్యవేక్షించాలని తెలిపారు. భూ రీసర్వే నిర్వహించే సమయంలో ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన వివరాలను సంబంధిత రికార్డులతో పరిశీలించాలని, ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు తలెత్తితే వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి కేటాయించిన స్థలాలలో ఇళ్ల నిర్మాణ పనులు సజావుగా కొనసాగేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని, ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాగిరెడ్డి

కొడంగల్‌లోని నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ నాయకులు

కూకట్‌పల్లి, నవంబరు 11 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. జన్మదినాన్ని పురస్కరించుకొని, కొడంగల్‌లోని ఆయన నివాసానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా: నాగిరెడ్డి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజా పాలన పేరుతో ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని వారికి సంక్షేమ ఫలాలను అందించడంలో ముందుందని అన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి నిత్యం ప్రజాసేవలో ఉంటూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని వేడుకున్నట్లు నాగిరెడ్డి తెలిపారు.



అల్ఫోర్స్ ఇ-టెక్నో ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతోత్సవాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్, 11(ప్రభాత ఉదయం):

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి యొక్క పాత్ర చాలా విశిష్టమైనదని మరియు స్ఫూర్తిదాయకమైనదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వారి నుండి స్ఫూర్తి తీసుకోవాలని మరియు అమలుపరచినటువంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను విస్తరింప చేయాలని వారు కోరారు. నేడు భారతదేశ విద్యా రంగంలో అగ్రగామిగా ఉండడానికి ప్రధాన కారణం వారేనని అదే విధంగా సాంస్కృతిక రంగంలో సైతం భారతదేశ విజయాలు సాధిస్తున్నదంటే వారి యొక్క కృషి మాత్రమేనని సగర్వంగా చెప్పవచ్చని వాళ్ళు చెప్పారు. గొప్ప స్వాతంత్ర ఉద్యమంలో . ఏమి ఆశించకుండా దేశసేవనే పరమావధిగా భావించి భారతదేశానికి నూతన చరిత్రను లిఖింప చేసినటువంటి గొప్ప రాజనీతిజ్ఞుడు – రాజకీయ నాయకుడు – స్వాతంత్ర సమర యోధుడు వారని గుర్తు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింపచేసాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుడికి నివాళులు

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వం, సోదరభావం, విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలి.బండి రమేష్

కూకట్‌పల్లి, నవంబరు 11 (ప్రభాత ఉదయం)

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని హేమదుర్గ భవన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం అల్పసంఖ్యాక వర్గం కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ నవాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కమ్మ సంస్థ అధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సంఘం ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు బండి రమేష్ పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి పునాదులు వేశారని కొనియాడారు. దేశ సమైక్యత, మత సామరస్యం, విద్యా ప్రగతి కోసం ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వం, సోదరభావం, విద్యాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి బాలాజీ, లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, పాషా, సల్మాన్, లక్ష్మణ్ గౌడ్, జమీర్, ఎజాజ్, రమణ, మస్కుదలి, ప్రసన్నకుమార్, కిట్టు, సుధాకర్, ప్రకాష్, ముదిరాజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608